ఎక్కడో అనామకుడుగా పడివున్నవాణ్ణి తెచ్చి యింత వాణ్ణిచేసిన కీర్తి ఏవిధంగానైతే గురునాథంగారికి దక్కిందో, ఆ విధంగానే సోమయాజులులో సంగీతం—డబ్బుచేసే సంగీతం—ఇంకిపోయిన మర్నాటినుంచీ వాణ్ణి బతికున్నంతకాలమూ పోషించే భారంకూడా గురునాథంగారికే దక్కుతుంది. అందుకుగాను సోమయాజులు యావజ్జీవమూ వారికి కృతజ్ఞుడై వుండగలడు.

పంచాయతీ
పన గ్రంథాలయం,
స్తోలు :: కృష్ణా జిల్లా.

## సినిమా కథ

కథానాయిక పాడుతూ ఫేడిన్ అయి, క్లోజప్‌లో పాడుతూ మనకేసిచూచి నవ్వుతూ గదంతా డాన్సు చేస్తున్నది. "ఎంత హాయి! ఎంత హాయి!" అనే పల్లవినిబట్టి ఆమెకు హాయిగావున్నట్టూ, అందుకే డాన్సు చేస్తున్నట్టూ మనకు తెలుస్తున్నది.

ఇంతలో కాఫీ పట్టుకుని కూతురిపాటకు లయగా అడుగులు వేస్తూ వచ్చి, పాటా బాజాభజంత్రీలూ ఆగిపోయినదాకా నిలబడి కూతురికి కాఫీ అందిస్తూ, "ఎటువంటివాడు రావలిసున్నాడో!" అన్నది తల్లి.

కథానాయిక ప్రణయకోపం మొహంపెట్టి, "పోమ్మా!" అన్నది.

"ఏమే! మంచి డాక్టరు మొగుడై. యిద్దరూ ప్రాక్టీసు పెడితే యెంత బాగుంటుంది?" అన్నది తల్లి.

కూతురు నోటినుంచి కాఫీకప్పు దించి—లిప్‌స్టిక్ పెదవులకు కాఫీతడి లేదు——"నువ్వెప్పుడూ యిట్లాగే అంటావు !" అని చెప్పింది, మొహం చిట్లించి మూతితో మాత్రమే నవ్వుతూ.

మన కథానాయికకు తండ్రి లేడుగాని ఆయన పటం గోడన వ్రేళ్ళాడుతున్నది—ఇంత బూజుగాని, దుమ్ముగాని లేకుండా దానికి ఒక దండకూడా వేసివున్నది.

తల్లి యేడుపుగొంతుపెట్టి ఆ ఫోటో దగ్గిరికివెళ్ళి, "ఆయనవుంటే మనకిన్ని యిబ్బందులు రాకపోనుగద !" అన్నది.

కూతురు "హోయిహోయి" పాట మరిచిపోయినదానల్లే నిట్టూర్చింది.

ఈ తల్లికూతుళ్లు పడే కష్టాలు మనం తెలుసుకోవటం అవసరం. కూతురు ఫైనల్‌యియర్ మెడిసనే చదువుతున్నది. నూటికి మూరేసి మార్కులు తెచ్చుకుంటున్నది. తల్లి అంట్లు తోమి కూతుర్ని చదివిస్తున్నట్టు నిదర్శనాలేమీ లేవు. అయినా వాళ్ళకు డబ్బులేదు, రాబడిలేదు. అందుకని తల్లి జార్జెట్ చీరలు కట్టుతున్నది, కూతురు సాదా నైలాన్ దుస్తులు మాత్రమే ధరిస్తున్నది. డబ్బుంటే యింకా యెంత పెద్దయింట్లోవుండి, యెంతబాగా బతికేవాళ్లు, పాపం !

అయితే కథానాయిక గనక, మెడికల్ కాలేజీలో సహాధ్యాయినులందరూ చెలికత్తెల్లాగా వుండి, కణ్వాశ్రమం శకుంతలకు అనసూయాప్రియంవద యెలా వుండేవారో అలా

వుండి, ఆమె ఆకలే తమ ఆకలిగా, ఆమె ప్రణయమే తమప్ర... కాదు, పరమాదర్శంగా ప్రవర్తిస్తున్నారు.

ఇప్పుడు మనం హీరోను కలుసుకోవాలి. ఇతనుకూడా మెడికల్ కాలేజి స్టూడెంటే. నాయికానాయకు లిద్దరూ ఒకటే క్లాసు. వాళ్ళిద్దరికీ మధ్య ప్రేమబంధం వున్నదని క్లాసులో అందరికీ తెలుసు. మగ స్టూడెంట్లు దుష్యంతుడి వేడుక చెలికాళ్ళలాగా ప్రవర్తిస్తారు. వాళ్ళ క్లాసులో ఇంకా ఆడపిల్లలున్నా వాళ్ళనుగురించి మగస్టూడెంట్లు పట్టించుకోరు.

హీరో ఎప్పుడూ ప్రపంచాన్ని వుద్ధరించే పనులే చేస్తూంటాడుగనుకనూ, హీరోయిన్ "ఎంతహాయి!" పాడి చాలాసేపయిందిగనకనూ, అతను హీరోయిన్ దగ్గిరకొచ్చి, "బిచ్చగాళ్ళకోసం ఒక నాటకం వేద్దామనుకుంటున్నాం, అందులో మీరు భరతమాత వేషంవేసి డాన్సు చెయ్యాలి" అంటాడు.

"మీ రడిగితే ఏదైనా చేస్తాను," అంటుంది కథానాయక; ఆమెఅతన్ని ప్రేమిస్తున్నట్టు స్పష్టం కాగలందులకు.

హీరో ఆ మాటలు అర్థంచేసుకోకనో, చేసుకునో, "మీ రలా అంటారని నాకు ముందే తెలుసు." అని మొహం చిట్లిస్తాడు, తీవ్రమైన ఆలోచనలు ఉన్నట్టు.

అక్కడినుంచి పాట అందుకుని హీరోయిన్ వీధివెంట పాడుకుంటూ, మధ్యమధ్య భాగవతారు గారల్లే అడుగేస్తూ వీధులవెంటా, ఒక చేనుపక్కగా, ఒక మోటబావిచుట్టూ తిరిగి, ఒక కొండ ఎక్కి దిగి, పాటా భజింత్రీలూ ఆగే సమయానికి ఇంటికి వచ్చేసింది.

ఆమె లోపలికి అడుగుపెడుతుండగానే ఆర్కెస్ట్రా కెవ్వున అరిచింది. ఎందుకంటే హీరోయిన్ ఇంటలేనప్పుడు ఆమె మేనమామ వచ్చివున్నాడు. అతన్ని చూడగానే హీరోయిన్ మొహం ముడుచుకు పోయింది. ఎందుకంటే ఈ మేనమామ విలన్. అందుకనే హీరోయిన్‌ను చూచి నవ్వి, "డాక్టరు వచ్చిందే! ఇతరరోగాలు నయంచెయ్యటం కాదు, నా హృదయంలో జబ్బు నయంచేస్తేనే నువ్వు నిజమైనడాక్టర్ అని ఒప్పుకుంటాను."

హీరోయిన్ ప్రణయకోపం మొహం పెట్టి అతనికి ఎడంగా తప్పుకుని లోపలికి పోతుంది. విలన్ ఎందుకో గట్టిగా నవ్వుతాడు.

హీరోయిన్ "అమ్మా, అమ్మా" అంటూ తల్లి దగ్గిరికి వచ్చేముందే వ్యాసపీటమీద భాగవతంలాంటి పుస్తకం పట్టుకుని కొద్దిపాటి ఆర్కెస్ట్రా సహాయంతో "నల్లనివాడు పద్మనయనంబులవాడు" అనే పద్యం పన్నెండేళ్ళ పిల్ల గొంతుతో మాల్గోస్ రాగంలో సంగతులు వేసి పాడుతున్నది. పద్యమూ భజంత్రీలూ అయిపోగానే హీరోయిన్ లోపలికి వచ్చి, "అమ్మా, అమ్మా," అన్నది.

తల్లి అంతలోనే గొంతుమార్చి, "మామయ్యొచ్చాడు, తల్లీ" అన్నది.

"ఆ దుర్మార్గుణ్నెందుకు రానిచ్చావు మనింటికి?" అన్నది హీరోయిన్. పళ్లు కొంచెంగా కొరికి మొహంచిట్లించి ముక్కు ఎగరేస్తూ.

తన కూతురికి విలనంటే కోపమని అర్థమై తల్లి ఆశ్చర్యంతో, "అదేమిటే?" అన్నది.

"నీకు తెలీదు లే, అమ్మా," అన్నది కథానాయిక, విలన్ చేత అనేకసార్లు బలాత్కరించినదానిలాగా.

"నిన్ను తనకిచ్చి పెళ్ళి చెయ్యమంటున్నాడు. బాగానే వుంటుందికూడాను. ఐన సంబంధం. బోలెడంత సంపాదిస్తున్నాడు. ఫ్యాక్టరీకి మేనేజరట. మూడొందలు జీతమిస్తారు. బీచిలో పెద్ద బంగళా. ముప్పై వేలు చేసే కారు కొన్నాట్ట. నూరు రూపాయలకు తక్కువఖరీదు గల ప్యాంటు వెయ్యడు. క్లబ్బు కెళ్ళి రోజుకు నూరు రూపాయల బుడ్డి సారా తాగుతాట్ట. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తాడమ్మా. నాకీ మధ్య ఒంట్లో బాగోటం లేదుకూడాను" అంటూ తల్లి దగ్గటం మొదలుపెట్టింది.

అంతదాకా కళ్ళు మూసుకుని హీరోను జ్ఞాపకం తెచ్చుకుంటున్న హీరోయిన్ కళ్లు చాలా పెద్దవిచేసి ఆదుర్దాగా "ఏమిటమ్మా? ఏమిటమ్మా?" అంటూ తల్లిమీద అమ్మశక్తిలాగా పడింది.

ఆ బొమ్మలోంచి యింకో బొమ్మ వచ్చేటప్పటికి తల్లి మంచంమీద పడుకుని దగ్గుతున్నది. ముందు డాక్టరూ అతని బాగ్ పట్టుకొని హీరో వచ్చారు. తల్లికి తల పిసుకుతున్న హీరోయిన్ లేచి, "రండి, డాక్టర్!" (రండి డాక్టరుగారూ, అనటం పల్లెటూరు గమార్ల లక్షణం!) అంటూ హీరో చేతిలోవున్న బ్యాగ్ తీసుకొని, రెడీగావున్న స్టూలు మీద పెట్టింది.

హీరో ఆమెకేసి రేసుల్లో డబ్బు పోగొట్టుకున్నట్టు చూశాడు. "విన్నాను విన్నాను" అన్నట్టుగా తల పైకీ కిందకీ ఆడించింది.

డాక్టరు స్టెతోస్కోప్ తీసి రోగి గుండెలమీద పెట్టి పెద్ద నిట్టూర్పు విడిచి, మూలిగి "క్షయ! సీరియస్! బోత్ లంగ్స్ యఫెక్టెడ్!" అన్నాడు.

త్వరలో తానుకూడా డాక్టరు కాబోతున్నది గనుక, "నయమవుతుందా, డాక్టర్?" అని కొట్టవచ్చినట్టుగా అడిగింది.

డాక్టరు చప్పరించి, "ఈ రీలు దాటదు" అనేశాడు.

హీరో వూరికే వుండట మెందుకని. "శానిటోరియంకు పంపిస్తేను, డాక్టర్? అన్నాడు.

డాక్టరు దీర్ఘంగా ఆలోచించి, "అలా చెయ్యవచ్చు" అన్నాడు. అతను బరువుగా వెళ్ళిపోతుంటే భజంత్రీలు విషాదంగా వాయించారు.

పరీక్షలకు ముందు మెడికల్ విద్యార్థు లందరూ ఒక చోటికీ, విద్యార్థిను లందరూ ఇంకోచోటికి పిక్నిక్ వెళ్ళారు. ఆడవాళ్ళ పిక్నిక్ బాగుంది. ఎవరూ ఏమీ అనకుండానే వాళ్ళు విరగబడి నవ్వుతున్నారు. దాన్ని బట్టి వాళ్లు చాలా సంతోషంలో వున్నారని మనకు తెలుస్తుంది.

అదృష్టవశాత్తూ ఒక మఱ్ఱిచెట్టుకు పెద్ద వుయ్యాల వేసి వుంది. ఆ వుయ్యాలమీద యెక్కి కథానాయిక "ఓ లలలా! ఓహో లలలా!" పాట పాడుతున్నది. ఆమె సఖురాండ్రు సోల్పుగా నిలబడి కవాతు చేస్తున్నారు. డ్రిల్ సార్జెంట్

వుండి చెప్పినట్టుగా వాళ్లు స్టెతోస్కోపులను ఒకేసారి మెడకు వేసుకుని, ఒకేసారి పైకెత్తి, ఒకేసారి గుండ్రంగా తిప్పి, ఒకే సారి చెవులకు పెట్టుకుని, ఒకేసారి తమ గుండెలు పరీక్ష చేసుకుని చాలా గమ్మత్తు చేస్తున్నారు.

వే యేల? పరీక్షలకు ముందు లేడీ మెడికోలు పిక్నిక్ వెళ్ళి ఏమేం చేస్తే ఆదర్శప్రాయంగా వున్నట్టు పావలాక్లాసు వాళ్ళకు తోస్తుందో అవన్నీ చేస్తున్నారు.

ఇంకో లొకేషన్ లో మెడికల్ విద్యార్థులు. అందరూ సైకిళ్లెక్కి ఫార్మేషన్ రైడింగ్ చేస్తున్నారు. అన్నీ ఒకేసారి కొన్న సైకిళ్లు సరికొత్తవి. హరిదాసువెంట భక్తులు పాడినట్టుగా హీరో అన్న ప్రతిపంక్తిని అంటూ అందరూ కోరస్ పాడుతూ వస్తున్నారు. అదృష్టవశాత్తూ రోడ్డు నిర్మానుష్యంగా వుంది.

అక్కడ అమ్మాయిలు దాగుడుమూత లాడుతున్నారు. హీరోయిన్ కళ్ళకు గంతలు కట్టుకుని తన స్నేహితురాళ్ళను దొంగ చెయ్యడానికి చూస్తూవుంటుంది. అంతలో హీరో అక్కడికి ఒంటరిగా వస్తాడు. చెలికత్తెలంతా పారిపోయి చెట్లచాటున దాక్కుంటారు. హీరోయిన్ గాలిలో యీదుతూ వచ్చి, హీరోను తాకి, "ఆఁ, దొరికావులే!" అంటుంది. (కవిగారూ ఆ మాట పసందుగా వేశారు!)

హీరోయిన్ గంతలు తీసిపారేసి, కళ్ళూ, నోరూ పెద్దవిచేసి, "మీఁరా?" అంటుంది. అనుమానం వుంచటం మంచిదికాదని, హీరో బరువుగా నిట్టూర్చి "అవును... నేనే!" అన్నాడు.

చెట్ల చాటునుంచి వెకిలిగా నవ్వులు వినిపిస్తాయి. హీరోయిన్ ప్రణయకోపం మొహంపెట్టి, "ఊరుకోండి! వాళ్ళంతా మనని ఏడిపిస్తారు!" అంటుంది.

"నే నేమీ చెయ్యలేదే!" అన్నట్టుగా హీరో తన చేతులను అటూ ఇటూ తిప్పి చూసుకుంటాడు.

"రేపేకదూ మన ప్రదర్శనం!" అంటుంది హీరోయిన్ హీరోపక్కనే నడుస్తూ.

"అవును" హీరో నిట్టూరుస్తాడు.

కర్టెన్ పైకి లేస్తుంది. హీరోయిన్ భరతమాతగా ప్రేక్షకులకు కనిపిస్తుంది. "లేవండీ! నడుములు-కట్టండీ! దీక్షలు-పట్టండీ! లంచాలు—" అంటూ పాడుతూ హీరో ప్రవేశిస్తాడు. అనేకమంది ఆడవాళ్ళు అజంతా డ్రెస్సులు వేసుకుని సాముగరిడీలు చేస్తారు. ఆ గరిడీలకు పాటకూ ఏమీ సంబంధం వుండదు. కెమేరా ఒక ప్రక్కకు ఒరిగిపోతుంది. తరువాత రెండో పక్కకి ఒరుగుతుంది. ఆఖరుకు చేసేది లేక తల్లక్రిందులై పోతుంది. ప్రేక్షకుల్లో ఒకాయన జేబులోనుంచి చిన్న పొట్లం తీసి భావనఅల్లం ఇంత నోట వేసుకుని అమ్మాయిల అజంతా డ్రెస్సుల కేసి శ్రద్ధగా చూస్తాడు...

ప్రదర్శన మైనాక అందరూ హీరోను, హీరోయిన్‌నూ అభినందిస్తారు—హీరోయిన్ భరత మాతగా బాగా నిలబడి నందుకూ, హీరో "పట్టండీ, కొట్టండీ, కట్టండీ" అన్న మాటలకు సరిగా చేతులు వూపినందుకూనూ, సాముగరిడీలు చేసి, వెనక్కు మొగ్గలువేసి వక్షప్రదర్శనాలు చేసిన అమ్మాయిలకు గ్రూప్ ఫోటోలో వాళ్లు ఒక్కరు అభినందించారు.

(ఈ ప్రదర్శనంలో మనం చూసే మొదటి గ్రూప్ ఫొటో యీ ప్రదర్శనంలోనే.)

హీరో ఆపరేషన్ థియేటర్‌లో వున్నాడు. పెద్దసర్జను ఆపరేషన్ చేస్తున్నాడు. హీరో, హీరోయిన ఇద్దరూ ఆయన పక్కనవుండి నేర్చుకుంటున్నారు. అందరికీ మొహాలకు అడ్డంగా జేబురుమాళ్లున్నాయి. నెత్తిన గాంధీటోపీలున్నాయి. సర్జన్ హీరోకేసి కుడిచెయ్యి చాస్తాడు. హీరో గబుక్కున ఒక పట్కారు సర్జన్ చేతిలో పెడతాడు. ఆ తరువాత సర్జన్ ఎడమచెయ్యి చాస్తాడు. హీరోయిన్ ఒక స్పానర్ అందిస్తుంది. సర్జన్ వూపిరి సలపకుండా రెండు చేతులతోనూ కటింగుప్లయరూ, రెంచీలూ, అకురాళ్ళూ, చిన్నసుత్తెలూ, పిన్సర్లూ, పెనసళ్ళుచెక్కే మరలూ మొదలైనవి అందుకుంటూ చిట్టచివరకు మొహానికి అడ్డంవున్న చేతిరుమాలు తీసేసి దానితో నుదురు తుడుచుకుని చిన్న చిరునవ్వు నవ్వుతాడు.

హీరోకూడా చేతిరుమాలు లాగేసి ఆపరేషన్ టేబిల్ మీద పడేసి చెయ్యిపిడికిలి బిగించి పైకెత్తి, "జై, డాక్టరు గారికీ జై!" అంటాడు. నర్సులూ, అసిస్టెంటు సర్జన్లూ ఒక్కసారి "జై!" అని పెడబొబ్బ పెడతారు. సర్జన్ ఎందుకో హీరోను భుజంమీద తట్టి వీపు తిప్పి వెళ్ళిపోతాడు.

హీరో అటూ ఇటూ చూస్తాడు. హీరోయిన్ లేదు. ఆమెను వెతుక్కుంటూ వార్డులవెంట బయలుదేరుతాడు. ఆమె ఒకచోట బల్లముందు కూచుని యేడుస్తున్నది. ఆమె

పక్కనే ఒక టెలిగ్రాం. హీరో దాన్ని యెత్తి చూసీచూడకుండానే, "డెడ్ !" అని చదువుతాడు...

హీరోయిన్ తల్లి చావు కారణంగా లిప్‌స్టిక్, మొహాన బొట్టూ, తలకు చమురూ మానేసి, మాసికలు వేసిన చీర (నైలాన్ జార్జెట్ వాయిల్ నేతచీర) కట్టుకొని దరిద్ర శోక దేవతలాగా వుంది.

"ఇంకా నాకు భవిష్యత్తు లేదు. నా చదువు మంట గలిసిపోయింది. నేను కన్న కలలు కరిగిపోయాయి. నా బ్-రతుకు అనాథ బ్-రతు కయిపోయింది" అంటూ ఏడుపు బాగా రావటానికి క్రింది పెదవి గట్టిగా కొరుక్కుంటుంది.

"మనం పెళ్ళాడేసి సుఖంగా వుండాలి!" అంటాడు హీరో.

"నీ కేం మతిపోయిందా యేమిటి! ఇంకా యేడో రీలు పూర్తికాలేదు. విలన్ సీక్వెన్సులన్నీ ముందేవున్నాయి. పైగా మనం ప్రేమించుకున్నాం. మనకు పెళ్ళి ఎలా అవుతుంది ?" అని హీరోయిన్ మందలిస్తుంది.

హీరో నిట్టూర్చి కనుబొమలూ, తలా ఎగరేసి, "అవును ! మన పెళ్ళికి ఫారుమ్యులా ఒప్పదు !" అంటాడు.

హీరోయిన్ పెళ్ళాడిందా, లేక అవివాహిత వితంతువుగా ఉండిపోయి తన పాతివ్రత్యాన్ని కాపాడుకుందా ? విలన్ ఏమయినట్టు ? హీరో ఏమవుతాడు ? అసలు ఇదేం కథ ? ఈ వివరాలన్నీ దయచేసి, మరోలా అనుకోకుండా, తెరపైన చూడండి.

జైహింద్ !